క్లుప్తంగా

హోలీ వేడుకలు



బయ్యారం: మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం హోలీ పండుగ వేడుకలను నిర్వహించారు. బయ్యారం, జగ్గుతండా, వెంకట్రాంపురం తదితర గ్రామాల్లో పండుగ సందర్భంగా యువతీ, యువకులు రంగులతో పండుగ సంబురాల్లో పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలి

నెల్లికుదురు: రైతులు సాగు చేస్తున్న పంటలకు ఎస్‌ఆర్‌ఎస్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని ప్రగతిశీల వ్యవసాయ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల యాకయ్య ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేయకపోవడం ద్వారా చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయని, చెరువులు, కుంటల కింద సాగు చేస్తున్న పంట పొలాలు నీరు అందక ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే మిర్చి పంటలో పలు రకాల వైరస్‌ల కారణంగా పంటలను రైతులు నష్టపోయారని, ఉన్న కాస్త వరిసాగుకు నీరు రాకపోతే రైతు మరింత నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా రైతులకు ప్రభుత్వం పంటల సాగుకు నీరు విడుదల చేసి ఆదుకోవాలన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం



గూడూరు: మండలంలోని మర్రిమిట్టలో ఆదివారం బొడ్రాయి, హనుమాన్ ఆలయాల వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించిన గూడూరుకు చెందిన చీర భిక్షపతి అనే ఉపాధ్యాయుడిని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకన్న, శ్రీశైలం, పూజెం నరసయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

రమేష్‌రెడ్డికి అభినందనలు



మహబూబాబాద్ రూరల్: సూర్యాపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పటేల్ రమేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య ఆదివారం బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపాడు. కార్యక్రమంలో కామ సంజీవ రావు, బండారు వెంకటరమణ, రాందాస్ ఉన్నారు.

ముస్లిం సంఘం మండల కమిటీ ఎన్నిక



కేసముద్రం: కేసముద్రం మండల ముస్లిం సంఘం నూతన కమిటీని ఆదివారం కేసముద్రం విలేజ్ మసీద్ జరిగిన ఎన్నిక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా అర్పనపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా, ఉపాధ్యక్షులుగా షేక్ మైబుసుభానీ, సయ్యద్ ఖాదర్, యాకుబ్‌పాషా, సర్వర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నాయిం, సహాయ కార్యదర్శులుగా మహమ్మద్ అంకూస్, గఫార్, బాష్మియా, యాకుబ్ పాషా, కోశాధికారి అక్బర్, గౌరవ సలహాదారులుగా హఫీజ్, జావిద్, సభ్యులను ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

నర్సంపేట: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయడమే లక్ష్యంగా లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఅబాకస్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ శోభారాణి తెలిపారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అబాకస్, చెస్ పోటీలకు ముఖ్యఅతిథులుగా గోక రామస్వామి, విజ్‌డమ్ పాఠశాల డైరెక్టర్ జావెద్ హాజరై మాట్లాడారు. నానాటికీ శారీరక శ్రమ, ఆటల పట్ల పిల్లల్లో ఉత్సాహం సన్నగిల్లుతోందని ఆందోళన వెలిబుచ్చారు. తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. చెస్ పోటీల్లో అర్బాజ్, తౌసిఫ్ అలీ, ప్రణవ్య, అర్మాన్‌షా, అబాకస్ పోటీల్లో అశ్విత, వర్షిత, మనస్విని, దేవాన్ష, వరునిక, సాయితన్వి, సరయు, అల్వినా కుల్సుం, అదీనా జైనబ్, సాయి ఆద్య గెలుపొందగా ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు ప్రకాశ్, ప్రవీణ్, సాధినేని సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ



మానుకోటలో మట్టలతో ఊరేగింపు..



డోర్నకల్‌లో మట్టల ఊరేగింపు..



ప్రార్థనలో పాల్గొన్న క్రీస్తు ఆరాధకులు



గార్లలో..

మహబూబాబాద్ రూరల్: ప్రజల రక్షణార్థం ప్రభువైన ఏసుక్రీస్తు జన్మించారని ఎల్ షద్దాయ్ చర్చి పాస్టర్ అనుదీప్ అన్నారు. పరిశుద్ధవారపు గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో ఆదివారం క్రీస్తు ఆరాధకులు ఖర్జూర మట్టలకు పూలు అలంకరించి ఏసుక్రీస్తుకు స్వాగతం పలుకుతూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రభువు సమస్త మానవాళి కోసం తన ప్రాణాలను అర్పించటానికి ఎరుషలేము ప్రవేశం జరిగిందని పేర్కొన్నారు. కోర్టు సెంటర్ నుంచి కురవి బస్టాండ్ వరకు చర్చి పాస్టర్, విశ్వాసులు ర్యాలీగా సువార్తను ప్రకటిస్తూ పట్టణ ప్రజల క్షేమం కోసం ప్రతి సెంటర్‌లో ప్రార్థనలు చేసి అనంతరం ఎల్ షద్దాయ్ చర్చిలో ఆరాధన జరిపారు. కార్యక్రమంలో ఎస్తేరు జయశ్రీ, అభిషేక్, ఉదయశ్రీ, మత్తయి, నెహెమ్యా, రమేష్, రవి నిర్మల, ప్రవీణ్, చందు, మరియమ్మ, సామ్యేల్, శ్రీజన్ ఇమ్మన్యూల్, రూతమ్మ, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

బ్లెస్డ్ చర్చిలో..

జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డలోగల బ్లెస్డ్ చర్చిలో మట్టల ఆదివార వేడుకలు నిర్వహించగా చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రేమానందం క్రీస్తు ఆరాధకులను ఉద్దేశించి ప్రసంగించారు. పట్టణ ప్రజలందరికీ, క్రీస్తు ఆరాధకులకు క్రీస్తు అనుగ్రహం కలిగి సుఖశాంతులతో జీవించాలని వేడుకుంటూ ప్రార్థనలు నిర్వహించారు.

డోర్నకల్: స్థానిక ఎపిఫనీ చర్చిలో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈత, తాటి కొమ్మలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి డోర్నకల్ బిషప్ రెవ.డాక్టర్ కోడిరెక్క పద్మారావు ప్రసంగించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గార్ల: మట్టల ఆదివారంను పురస్కరించుకొని గార్లలోని అంబేడ్కర్‌నగర్ సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం గార్ల పురవీధుల్లో మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా చర్చి ఫాదర్ రెవరెండ్ జ్ఞానరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవితేజ, దేవా, జ్యోత్స్న, రాజు, బాబు, దేవరాజు, డేవిడ్, జాన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

మహబూబాబాద్: ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి హెచ్చరించారు. రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం శివారు కవిత కాలనీ సమీపంలో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేసిన మూడు ఇళ్లను, పాత కలెక్టర్ కార్యాలయం వెనుక సర్వే నంబర్ 551 ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేసిన ఒక ఇంటిని జేసీబీతో కూల్చివేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు స్థలాల కొరత ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసి నష్టపోవద్దన్నారు. అక్రమ నిర్మాణాలన్నింటిని తప్పని సరిగా కూల్చివేస్తామన్నారు. అవసరమైతే కబ్జాదారులపై కేసులు పెడతామని హెచ్చరించారు. పేదలు కూడా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసి నష్టపోవద్దని అర్హులకు ప్రభుత్వమే న్యాయం చేస్తుందన్నారు. కూల్చివేతలో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఆర్‌ఐ కృష్ణ ప్రసాద్, మున్సిపాలిటీ సిబ్బంది శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 27వ తేదీ బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.చిరంజీవి ఆదివారం తెలిపాడు.

గుడుంబా స్వాధీనం

దంతాలపల్లి: మండలంలోని ఆగపేట్ గ్రామంలో 10లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు. మండలంలోని ఆగపేట్ గ్రామంలో యాసాని వెంకటయ్య గుడుంబా విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారంతో సోదాలు చేయగా 10లీటర్ల గుడుంబా లభ్యమైందన్నారు. వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

అంజనాపురంలో..

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన గూగులోత్ మహేష్ ఇంట్లో అక్రమంగా 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ ఆదివారం తెలిపాడు. మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

నర్సంపేట: ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో రమేశ్ మాట్లాడారు. పాలక పార్టీలు అధికారం దక్కించుకోవడానికి అనేక హామీలు గుప్పించి గద్దెనెక్కి ఆచరణలో విస్మరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి మతోన్మాదంతో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు మోసపూరిత విధానాలతో వస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను విస్మరించిన పార్టీలను గద్దె దించాలని కాంక్షించారు. నర్సంపేటలోని స్లమ్ ఏరియాలో సమస్యలు నెలకొన్నాయని చెప్పారు. పేదలు నివసించే కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ), బీఎల్‌ఎఫ్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు కొట్టె సదానందం, కలకోట్ల యాదగిరి, జన్ను రమేశ్, దామ సాంబయ్య, గాజుల వెంకటయ్య, మార్త నాగరాజు, బుడిమె సురేందర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల పాలనలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

తొర్రూరు: వంద రోజుల పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో బీజేపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగిస్తోందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో అత్తా, కోడళ్ల పాలన ప్రజలకు ఏవగింపు తెప్పిస్తుందని, ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి ఊచలు లెక్కబెట్టడం ఖాయమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వరరావు, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు కన్నయ్య, రంగు రాములు, సాయిని ఝాన్సీ, బి.సురేష్, పైండ్ల రాజేష్, కిన్నెర యాదగిరి, యాకయ్య పాల్గొన్నారు.

మహనీయుల మాసంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న పార్నంది రామయ్య

మహబూబాబాద్ అర్బన్: ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా నిర్వహించుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు పార్నంది రామయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రామయ్య మాట్లాడుతూ.. ఏప్రిల్ 5న భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ జయంతి, 11న భారత సామాజిక విప్లవ పురుషుడు మహాత్మజ్యోతిరావ్ పూలే జయంతి, 14న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి ఉందన్నారు. ఈ మహనీయుల జయంతి వేడుకలను గ్రామాగ్రామాన నిర్వహించాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ మాట్లాడుతూ.. మహనీయులు, సామాజిక సంస్కర్తలు అణగారిన వర్గాలను పైకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధరవత్ బద్రి నాయక్, జిల్లా నాయకులు మహేందర్, లాలు నాయక్, వెంకటేశ్వర్లు, దేవ్‌సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1988-89 బ్యాచ్ విద్యార్థులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కిరాణ వర్తక సంఘం భవనంలో ఆదివారం మానుకోట మండలంలోని కంబాపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గురువులు విష్ణుమూర్తి, నారాయణరావు, రాం నర్సయ్య, కోమురయ్య, అంతయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నూకల సుధీర్‌రెడ్డి, సత్యనారాయణ, జెన్నయ్య, జగన్, సుజాత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుందాం..

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకుందామని మండల ఇన్‌చార్జ్ కాకిరాల హరిప్రసాద్ రావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మండల అధ్యక్షుడి మార్పుతో నెలకొన్న సమస్య పేరిట పార్టీ విజయం కోసం పాటుపడిన నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడాల్సిన అవసరం లేదన్నారు. దేవునిగుట్ట పరిరక్షణ కోసం ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. దేవరుప్పుల మండల అధ్యక్షుడిగా కొనసాగిన పెద్ది కృష్ణమూర్తికి సముచిత స్థానం కల్పించే దిశలో పార్టీ యోచిస్తుందన్నారు. పార్టీ అంతర్గత సమస్యను రోడ్డెక్కియ్యకుండా పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మాజీ అధ్యక్షుడురేష్‌బాబు, కాసారపు ధర్మారెడ్డి, ఓడపల్లి రవీందర్, రసూల్, పాండు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



దంతాలపల్లి: మండలంలోని చెరువులు, కుంటల్లో రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వకందారులు సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆదివారం రెండు జేసీబీలతో ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తరలించారు. గతంలో పలుమార్లు ప్రజలు, మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే తవ్వకాలు ఆపుతున్నారు. తరువాత యథేచ్ఛగా మట్టి తవ్వకాలు మొదలు పెడుతున్నారు. ఇదే విషయమై ఎస్‌ఆర్‌ఎస్పీ ఏఈ మౌనికను వివరణ కోరగా మట్టి అక్రమ రవాణా చేసిన రెండు జేసీబీలు, ట్రాక్టర్ల నంబర్లు తమ వద్దకు వచ్చాయని చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవోపేతంగా శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్: అనంతాద్రి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అనంతాద్రి గుట్టపై వెలసిన స్వయంభూ జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో సౌమిత్రి హేమంత్ ఆచార్యుల యాజ్ఞిక నిర్వహణలో ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధారాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీవారికి యజ్ఞోపవీతధారణ చేసి, స్వామివారు, అమ్మవార్లకు జీలకరబెల్లంధారణ చేసి మధుపర్కం సమర్పణ అనంతరం అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులందరికీ శ్రీమన్నారాయణుడి అనుగ్రహం కలగాలని, ఆధ్యాత్మిక, భక్తిభావాలతో ఉండే అందరికి భగవంతుడు సుఖశాంతులు కలుగజేయాలని అర్చకులు వేంకటేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహించారు. భక్తుల కోసం అనేక రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఆలయ ట్రస్ట్ చైర్మన్ నూకల రాంచంద్రారెడ్డికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. మానుకోటతోపాటు పలుప్రాంతాలకు చెందిన భక్తులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీజగన్నాథ వేంకటేశ్వరస్వామి సేవాట్రస్టు, శ్రీలక్ష్మి వేంకటేశ్వర సేవాట్రస్ట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో బీజేపీ మోసం



మాట్లాడుతున్న శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి వందరోజుల్లో వర్గీకరణ చేస్తానని బీజేపీ మోసం చేసిందని టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నియోజకవర్గ స్థాయి సమావేశం మండలంలోని అయోధ్య గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాయమాటలు చెప్పిందన్నారు. ఓటు అనే ఆయుధంతో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.వెంకటేష్ మాదిగ, సంఘం జిల్లా అధ్యక్షుడు జినుక రవీందర్ మాదిగ, నాయకులు పుల్లయ్య, వేణు, ఇద్దమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫీజును ఒక్కోపేపర్‌కు రూ. 300చొప్పున, పేపర్ 1, 2లకు కలిపి 600ఉండగా ఈ ప్రభుత్వం రూ.2000లకు పెంచడం నిరుద్యోగులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి ఫీజు తగ్గించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, కోశాధికారి నాగమల్లయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ గల నాయకుడు సుధాకర్‌రావు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పెద్దవంగర: పాలకుర్తి (చెన్నూరు) మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావుకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితోపాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. ఆదివారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో డాక్టర్ సుధాకర్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. సుధాకర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా పలు ప్రజాప్రతినిధులు, అభిమానులు డాక్టర్ సాబ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు, దయాకర్‌రావు మాట్లాడుతూ.. సుధాకర్‌రావు నీతి, నిజాయితీ, నిబద్ధత గల నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, తగ్గెళ్లపల్లి మల్లికార్జున్, బొల్లు ఊషయ్య, దంతాలపల్లి రవి, ఎం.శ్రీనివాస్, శుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గంగారం: కోయ ఇలవేల్పు పండుగలు, గొలుసు కట్టు జాతరలుగా నిర్వహించాలని ఐటీడీఏ పీసా కోఆర్డినేటర్ కోమురం ప్రభాకర్ అన్నారు. గంగారం మండలంలోని చింత ఇంటి పేరు ఇలవేల్పు కాసాలానాయుడు జాతరకు కోమురం ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోయల ఇలవేల్పుల పిల్ల జాతరలను ప్రభుత్వమే నిర్వహించి ఆదివాసీ కోయ సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో జీఎన్‌ఏఎఫ్‌ఏయూ హైదరాబాద్ ప్రొఫెసర్ నిర్మల, పరిశోధక విద్యార్థులు సుజిత్, చాకి, కాశాలనాయుడు, తలపతి, చింత వజ్జయ్య, చింత రవి, గ్రామ పెద్దలు బుర్కా యాదగిరి, చింత బక్కయ్య, కన్నయ్య, నర్సయ్య పాల్గొన్నారు.